క్లుప్తంగా

మాలలంతా ఐక్యం కావాలి..



నినాదాలు చేస్తున్న దళిత నాయకులు, యువత

పాలకొండ రూరల్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న మాలల మహానిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు ఎద్దు లిల్లీ పుష్పనాథం కోరారు. ఈమేరకు డివిజన్ కేంద్రంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు బి. మోహనరావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ముఖ్య నాయకులు వి.శ్యామ్‌సుందరరావు, బి.జీవరత్నం, బి.గణేష్‌బాబు, పి.రమేష్, రవి, కస్పావీధి యువత పాల్గొన్నారు.

జీసీసీ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

భామిని: సీతంపేట గిరిజన కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ సంస్థ పాలకవర్గ డైరెక్టర్‌గా భామిని మండలం లోహరిజోలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పిరపక శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన్ను పార్టీ నాయకులు, గిరిజన సంఘ నాయకులు పత్తిక సింహాచలం, కీర్తిరాయి సుగ్రీవులు, కద్రక లక్ష్మీనారాయణ, తదితరులు బుధవారం ప్రశంసించారు.

త్వరితగతిన నిర్మాణాలు



నిర్మాణాలను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గోకులం నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కుడ్డపల్లి, దేవనాపురం, వలగజ్జిలలో నిర్మిస్తున్న గోకులాల నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. నిర్దేశించిన పనుల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీర్లకు సూచించారు.

శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి..



నానిబాబు మాస్టారును సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు అన్నారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక పెద్ద కాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్పీలు ఎ.కేశవరావు, గారాల సూర్యనారాయణ తరగతి గదిలో సైన్స్ బోధన, ప్రయోగాత్మక వర్ణన తీరుపై అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన వీరఘట్టంనకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కమిడి నానిబాబును సన్మానించారు.

అవగాహనతో ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవించే క్రమంలో అవగాహనతో వాటిని అధిగమించడంతో పాటు ప్రమాద తీవ్రతను కట్టడి చేయవచ్చని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రమాదాలు జరిగితే ఎటువంటి నివారణ చర్యలు చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జామి రవి, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సింహాచలం, గౌరీశంకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

కొమరాడ: గిరిజన యువత సారా, గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్ వంటి చెడ్డ అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ కె.నీలకంఠం అన్నారు. మండలంలోని కొండ కూనేరు గ్రామంలో బుధవారం యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎక్కువగా సారాకు అలవాటు పడి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించకూడదన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోమాతకు పూజలు..



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలోని గోశాల వద్ద బుధవారం గోమాత పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రత్యేక అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గోమాత సేవ చేసిన వారికి పూర్వజన్మల కర్మలు నశిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సూర్యనారాయణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

– పాలకొండ

అన్నసమారాధన

పాలకొండ పట్టణంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన చేపట్టారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర పంచాయతీ మాజీ చైర్మన్ పల్లా విజయనిర్మల ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–పాలకొండ



సమ్మెకు సిద్ధం..



తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మె చేయనున్నట్లు 108 అంబులెన్స్ సిబ్బంది స్పష్టం చేశారు. ఈ మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

– వీరఘట్టం

సహస్ర జ్యోతిర్లింగార్చన..

పాలకొండలోని లలితా త్రిపురసుందరి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకుడు పత్రి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు 1100 మట్టి ప్రమిదల్లో జ్యోతులు వెలిగించారు. కార్తీకమాసంలో దీపార్చన విశిష్టతను అర్చకుడు వివరించారు.

– పాలకొండ రూరల్



104 ఉద్యోగుల ఆందోళన



వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా 104 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు ఆనందరావు, దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం గరుగుబిల్లిలోని పీహెచ్‌సీ ఆవరణలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ , సక్రమంగా జీతాలు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు.

– గరుగుబిల్లి

సమస్యలు పరిష్కరించాలి...



నిరసన దీక్ష చేపడుతున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఐటీడీఏ ముఖద్వారం వద్ద శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బిడ్డిక గణేష్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో కొంతకాలంగా గెస్ట్ టీచర్లు, పార్ట్‌టైమ్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామన్నారు. జీతాలు పెరగడం లేదని.. పీఆర్‌సీ వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 2014 నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులర్ చేశారని చెప్పారు. 2006 నుంచి పనిచేస్తున్న గురుకులం ఉపాధ్యాయులకు మాత్రం మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులర్ చేయాలని లేనిపక్షంలో సీఆర్‌టీలుగా మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని.. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ జిల్లా జేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావుతో పాటు నాయకులు ఎస్.చిరంజీవి, బి.ఉమామహేశ్వరరావు, బి.రామ్మోహనరావు, కె.భాస్కరరావు, హరిబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.ధర్మారావు, మోహనరావు, భవానీ, సీతంపేట, పెద్దమడి, మల్లి, తదితర పాఠశాలల నుంచి ఔట్‌సోర్సింగ్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికితీయాలి..

● ఎంఈఓ ఆనందరావు



వీరఘట్టం కాంప్లెక్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: తరగతి గదిలో పాఠాలు బోధించడమే కాకుండా, మనం చెప్పే పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా, లేదా అన్న విషయాన్ని కూడా గమనించాలని ఎంఈఓ ఆర్. ఆనందరావు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే బిటివాడ, నీలానగరం, వీరఘట్టం బాలికోన్నత పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించారు. సమావేశాల్లో ఆ పాఠశాలల హెచ్‌ఎంలు, హిందీ, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్ట్ టీచర్లు, ఎస్జీటీలు పాల్గొన్నారు.

పరామర్శ



బొడ్లపాడులో నారాయణరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని బొడ్లపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజాన నారాయణరావు తల్లి గౌరమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బొడ్లపాడు గ్రామానికి బుధవారం చేరుకుని నారాయణరావును పరామర్శించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు తదితరులున్నారు. అలాగే సంత–నర్సిపురం గ్రామ సర్పంచ్ కర్రి సత్యవతమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై విశాఖపట్నంలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఆమెను కూడా మాజీ ఎమ్మెల్యే కళావతి, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, భోగి మణి, తదితరులు పరామర్శించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..

పాలకొండ రూరల్: తోటపల్లి కాలువల ఆధునీకరణకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పలువురు రైతులు, ఆయా సంఘాల నాయకులతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల పరివాహక రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువల ఆధునీకరణ విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందిస్తామని అధికారులు చెప్పడం విడ్డూరంగా దన్నారు. 84 వేల ఎకరాలకు గాను 34 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని... అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తోటపల్లి కాలువలను ఆధునీకరించాలని కోరారు. సమావేశంలో కమిడి రామ్మూర్తినాయుడు, గురుబిల్లి అప్పలనాయుడు, వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ వసతిగృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం తిరుపతిరావు తెలిపారు. జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా ఐటీడీఏ స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు బుధవారం పార్వతీపురంలో జరిగాయి. పోటీల్లో గెలుపొందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో కిల్లక శ్రీకాంత్, డ్రాయింగ్‌లో గోరపాడు దిలీప్ ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఇనాం భూములపై సమగ్ర సర్వే చేపట్టండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు, మోహనరావు, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని జంపరకోట పంచాయతీ పరిధిలో గల ఇనాం భూములపై సమగ్ర సర్వే చేపట్టాలని ఎస్టీ, ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బత్తిన మోహనరావు, తదితరులు మాట్లాడుతూ.. సర్వే నంబర్–54లో ఉన్న భూములకు సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి కాజేయాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే అధికారులు సర్వే చేపట్టి బాధితులకు న్యాయంచేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ బాలమురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, తిరుపతిరావు, రాంబాబు, నారాయణరావు, ప్రసాదరావు, జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు



పాలకొండ రూరల్: గ్రంథాలయాల విశిష్టతను వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా కళాశాలలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమయం వృథా చేసుకోకుండా పుస్తకాలు చదవడం వల్ల అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కళాశాలలో గ్రంథాలయం ఏర్పాటు, అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సౌమిత్‌రాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, రాఘవేంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం..

సీతంపేట: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ముగింపు వారోత్సవంలో ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే వివిధ పోటీ పరీక్షల పుస్తకాలున్నాయని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన, డిబేట్ వంటి పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జి.చిన్నబాబు, లైబ్రేరియన్ బబ్బూరు గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతంపేట: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పుస్తక పఠనం ప్రయోజనకరం

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం వలన విజ్ఞానం పెరుగుతుందని, ఉన్నత చదువులు, ఉపాధి అవకాశాలు పొందుకునేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన స్పీడ్ రీడింగ్, కాలిగ్రఫీ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మేధావుల జీవితకథల పుస్తకాలతో కూడిన బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతుల అందజేత

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతంగా ఎదగాలని తహసీల్దార్ పి.బాల అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో పలు పోటీల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ నిర్వహకుడు ఎస్.మధుసూదనరావుతో పాటు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న తహసీల్దార్ బాల

'మన బడి - మన తోట'ను విస్తృతం చేయాలి : డీఈఓ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ

గరుగుబిల్లి: పాఠశాలల్లో మన బడి – మన తోట కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యాక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేసేందుకు అవసరమైన విజ్ఞానాన్ని అందించాలన్నారు. బడితోటలను మరింత అభివృద్ధి చేసేందుకు ఉపాధ్యాయులు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు డా. డి.పారినాయుడు మాట్లాడుతూ జట్టు సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా బడితోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలో ప్రకృతి వ్యవసాయ విధానాలలో బడితోటలను సాగుచేసేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు టి.శివకేశవరావు, రచయితలు టి.శివాజీ, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకంకితో తగ్గిన దిగుబడి



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వీరఘట్టం: వరి పంటకు నల్లకంకి తెగులు ఆశించడంతో దిగుబడి తగ్గిందని ఏఓ జక్కువ సౌజన్య తెలిపారు. మండలంలోని సంత – నర్సిపురంలో 1318 రకం వేసిన వరి పొలంలో బుధవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎకరాకు 15 బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. ఈ గ్రామంలో సుమారు 200 ఎకరాలకు నల్లకంకి తెగులు ఆశించిందని చెప్పారు. అయితే పంట నష్టపోయిన తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బాధిత రైతులు ఏఓను కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు బి. కృష్ణకాంత్, బాబ్జీ, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాయి నామస్మరణతో ప్రశాంతత



పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సాయి భక్తులు

వీరఘట్టం: సాయి నామస్మరణతో ఎంతో ప్రశాంతత చేకూరుతుందని సత్యసాయి సేవా సంఘ మాజీ కన్వీనర్ కిల్లారి సన్యాసినాయుడు అన్నారు. బాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక సత్యసాయి సేవాసమితిలో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం సాయంత్రం సాయి భక్తులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సాయి నామసంకీర్తనలు ఆలపించారు. అంతకు ముందు ఉదయం స్థానిక పీహెచ్‌సీలో ఉన్న గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ కందుల లక్ష్మి, మద్ది వరహానర్సింహులు, గెంబలి మురళీ, గడగమ్మ చిట్టి, చిన్నారి గురునాథంతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రాల పనితీరుపై పర్యవేక్షణ



గదబవలసలో పిండిమిల్లును పరిశీలిస్తున్న పీఎంయూ సభ్యులు

వీరఘట్టం: పీఎం జన్‌మన్ పథకం ద్వారా మండలంలో ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస కేంద్రాల పనితీరును జిల్లా ప్రాజెక్ట్ మానటరింగ్ యూనిట్ సభ్యులు బుధవారం పర్యవేక్షించారు. మండలంలోని శృంగరాయపురం, ఎస్ గోపాలపురం, బట్టిగూడ, గదబవలస, సింధునగరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస కేంద్రాలకు పీఎం జన్‌మన్ పథకం ద్వారా శతశాతం సబ్సిడీపై రూ.95 వేల విలువ గల పిండిమిల్లులు గతంలో అందజేశారు. ఈ మిల్లులుద్వారా వ్యాపారం ఏవిధంగా జరుగుతున్నదీ అధికారులు ఆరా తీశారు. కార్యక్రమంలో పీఎంయూ సభ్యులు తుమరాడ క్రాంతికుమార్, అల్లం మణిదీప్, కర్రి రామకృష్ణ, ఆర్.మురళీ, ఎఫ్‌పీఓ సీసీ వై.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి : వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఉప విద్యాశాఖాధికారి బి.రాజ్ కుమార్ అన్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠశాల సముదాయం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో శతశాతం ఫలితాలను సాధించేందుకు విద్యార్థులను సమయాత్తం చేయాలన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. పరిశీలనలో ఎంఈఓ డి.అప్పలనాయుడు, హెచ్‌ఎం ఎస్ఎల్ పాత్రుడు ఉపాధ్యాయులు కె.రవీంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని కేదారిపురం ఫీడర్ పరిధిలో ఈ నెల 22న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రీ కటింగ్ పనులు చేపట్టేందుకు నిర్ణయించినందున ఆ సమయాల్లో ఆ ప్రాంతంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ ఆధారిత పనులుంటే ముందస్తుగానే ముగించుకోవాలని, సహకరించాలని కోరారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సీతంపేట: మండలంలోని వలగజ్జిగూడ పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి 540 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను బుధవారం ధ్వంసం చేశారు. భూమిలో డ్రమ్ములతో పాతిపెట్టిన ఊటను గుర్తించి పారబోసినట్లు ఎస్సై వై. అమ్మన్నరావు తెలిపారు.